

చీనీ టన్ను రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.13, కనిష్టం రూ.4, సరాసరి రూ.7 పలికింది.



జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం పూట కొన్ని మండలాల్లో కొంత మేర చలి వాతావరణం కొనసాగింది.

భవితవ్యంపై ఉత్కంఠ

- బ్యాలెట్ బాక్సుల నుంచి నేడు ఓట్లు బయటకు
- ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌పై అందరిలోనూ ఆసక్తి
- 17వ తేదీ ఉదయం తర్వాతే తొలి రౌండ్ ఫలితాలు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం తథ్యమంటున్న విశ్లేషకులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల భవితవ్యం ఓట్ల లెక్కింపుతో తేలనుంది. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరచిన ఓట్లను గురువారం బయటకు తీయనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ జేఎన్‌టీయూ కళాశాలలో ప్రారంభమవుతుంది. కనీవినీ ఎరుగని రీతిలో ఈసారి పోలింగ్ శాతం నమోదైంది.

వైఎస్సార్‌సీపీ గెలుపు నల్లేరుమీద నడకే..
ఓటర్ల నాడిని బట్టి చూస్తుంటే వైఎస్సార్‌సీపీకి చెందిన పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం నల్లేరుమీద నడకే అని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వివిధ జిల్లాల్లో ఎగ్జిట్ పోల్ అంచనాలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మీద నమ్మకంతోనే గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలుస్తోంది. ఏదైనా చెప్పాడంటే చేస్తాడన్న నమ్మకంతోనే పోలింగ్ కేంద్రాలకు వచ్చినట్లు భావిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతోనే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులిద్దరూ విజయం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

మూడో స్థానానికి వెళితే టీడీపీ పరిస్థితి ఏమిటి?
తెలుగుదేశం పార్టీలో కొత్త గుబులు మొదలైంది. ఒకప్పుడు కంచుకోటగా ఉన్న అనంతపురం జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలో విజయం అటుంచి మూడో స్థానానికి వెళితే పరిస్థితి ఏమిటని మదనపడుతున్నారు. టీడీపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచే అవకాశం ఉందని, ఈ పరిస్థితుల్లోనే ఉన్నఫళంగా పీడీఎఫ్ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం చేసి దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇక్కడ మూడో స్థానానికి వెళితే కార్యకర్తలకు ఏమని సమాధానం చెప్పుకోవాలో అర్థం కావడం లేదని టీడీపీ నాయకుడొకరు వ్యాఖ్యానించారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లు సహకరించలేదని, ఇది చాలా దారుణమని మరో నాయకుడు అన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి రెండో స్థానంలోనా?
పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండటం చర్చనీయాంశంగా ఉంది. 40 ఏళ్ల చరిత్ర కలిగిన టీడీపీ మూడో స్థానంలోకి పడిపోవడంతో ఏం చేయాలో నాయకులకు దిక్కు తోచడం లేదు. జిల్లాలో ప్రతిపక్ష పార్టీగా టీడీపీ పూర్తిగా విఫలమవడం.. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వమే చొరవ చూపించడం.. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవడం వంటి కొత్త ఒరవడితో ఓటర్లు సీఎం జగన్‌ను బలంగా నమ్ముతున్నట్లు వెల్లడవుతోంది.

'ఎమ్మెల్సీ' ఓట్లు ఎలా లెక్కిస్తారంటే..

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు భిన్నంగా ఉంటుంది. అభ్యర్థి గెలవాలంటే పోలైన ఓట్లలో చెల్లని ఓట్లు తీసివేయగా.. చెల్లిన ఓట్లలో ప్రాధాన్యతా పద్ధతిలో 50 శాతం పైన ఒక ఓటు అధికంగా రావాలి. పట్టభద్ర ఎమ్మెల్సీకి సంబంధించి 2,45,576, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 25,887 ఓట్లు పోలయ్యాయి.

- తొలుత మొదటి ప్రాధాన్యత (1) ఓట్లు ఎవరికి ఎన్ని వచ్చాయో లెక్కిస్తారు. ఈ దశలో ఎవరైనా 50 శాతంపైన ఒక ఓటు అధికంగా సాధిస్తే ఆ అభ్యర్థిని గెలిచినట్లు ప్రకటిస్తారు. అప్పుడు 2వ, 3వ, 4వ ప్రాధాన్యత ఓట్లు లెక్కించాల్సిన అవసరమే ఉండదు.
- మొదటి ప్రాధాన్యత (1) ఓట్లు ఎవరికీ 50 శాతం పైన ఒక ఓటు అధికంగా రాకపోతే... మొదటి ప్రాధాన్యత ఓట్లు అందరికంటే తక్కువ వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ (తొలగింపు) చేస్తారు. అతని రెండవ (2) ఓటును మిగిలిన వారికి ఎవరికి ఎన్ని వచ్చాయో లెక్కించి కలుపుతారు. ఈ క్రమంలో ఎవరైనా అభ్యర్థికి 50 శాతంపైన ఒక ఓటు వస్తే గెలిచినట్లు ప్రకటిస్తారు. లేనిపక్షంలో లెక్కింపు కొనసాగిస్తారు.
- ఆ తరువాత తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని తప్పించి అతని రెండవ (2) ఓట్లను మిగిలిన వారిలో ఎవరికి ఎన్ని వచ్చాయో లెక్కించి కలుపుతారు. అప్పుడూ ఎవరికీ 50 శాతంపైన ఒక ఓటు రాకపోతే.... అప్పటికే ఎలిమినేట్ అయిన ఇద్దరి మూడవ (3) ప్రాధాన్యత ఓట్లను లెక్కించి పై వారికి కలుపుతారు.
- చెల్లిన ఓట్లలో 50 శాతంపై ఒక ఓటు వచ్చే వరకు ఆఖరు నుంచి తక్కువ ఓట్లు వచ్చిన వారి 2వ, 3వ, 4వ ఓట్లను ఒక క్రమంలో కలుపుతూ పోతారు.
- చివరిదాకా 50 శాతంపై ఒక ఓటు రాకపోతే... ఎలిమినేట్ కాని చివరి అభ్యర్థిని గెలిచినట్లు ప్రకటిస్తారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- ఉదయం 8 గంటలకు ప్రారంభం
- మూడు దశలుగా లెక్కింపు ప్రక్రియ



జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లు



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి (ఆరు జిల్లాలు) ఓట్ల లెక్కింపు జేఎన్‌టీయూ కళాశాలలో బుధవారం ప్రారంభం కానుంది. కౌంటింగ్ సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలవుతుంది. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఒక సుదీర్ఘమైన ప్రక్రియ. పోలైన ఓట్లలో చెల్లని ఓట్లు తీసివేయగా చెల్లిన ఓట్లలో 50శాతంపైన ఒక ఓటు ఎక్కువగా వచ్చినా ఆ అభ్యర్థి గెలిచినట్లుగా ప్రకటిస్తారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు ప్రకటనకు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు ప్రకటనకు ఒక రోజు నుంచి ఒకటిన్నర రోజు సమయం పట్టవచ్చని అంటున్నారు.

మూడు దశల్లో లెక్కింపు
ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మూడు దశలుగా నిర్వహిస్తారు. మొదటిగా ప్రాథమిక లెక్కింపు (ఇన్షియల్ కౌంటింగ్)లో బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కడతారు. ఆ కట్టలను డ్రమ్ముల్లో వేసి కలియబెడతారు (జంబ్లింగ్). రెండవ దశలో సమగ్ర లెక్కింపు (డిటైల్డ్ కౌంటింగ్)లో మొదటి ప్రాధాన్యత ఓటు లెక్కిస్తారు. ఆ ఓట్లను కట్టలుగా కట్టి ఉంచుతారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికీ 50 శాతంపైన ఒక ఓటు అధికంగా రాకపోతే మూడవ దశ బదిలీ ఓట్ల లెక్కింపు (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఓట్స్ కౌంటింగ్) చేపడతారు.

లెక్కింపునకు బ్యాచ్‌లు
ఓట్ల లెక్కింపు ప్రక్రియ అభ్యర్థి గెలుపు ప్రకటన వరకు నిరంతరాయంగా సాగుతుంది. పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు రెండు హాళ్లు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపునకు ఒక హాలు సిద్ధం చేశారు. పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 24 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు బ్యాచ్‌లు మూడు షిఫ్ట్‌లుగా పనిచేస్తాయి. ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఇక్క రెండు బ్యాచ్‌లు రెండు షిఫ్ట్‌లుగా పనిచేస్తాయి.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్‌ఓ, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జేఎన్‌టీయూ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను ఆమె బుధవారం పరిశీలించారు. గురువారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. పట్టభద్రులకు సంబంధించి డీటైల్డ్ కౌంటింగ్ ప్రారంభమైన 24 గంటల తరువాత అంటే 17వ తేదీ సాయంత్రానికి మొదటి ప్రాధాన్యత ప్రకారం కోటా వచ్చిందా లేదా అనేది చెప్పగలమన్నారు. టీచర్స్‌కు సంబంధించి గురువారం సాయంత్రం ఆరు గంటలకు మొదటి ప్రాధాన్యత కోటాపై స్పష్టత వస్తుందన్నారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్‌ఓ గాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

2017 ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్..	
పట్టభద్రుల ఓట్లు	2,49,582
పోలైన ఓట్లు	1,55,536
శాతం	62.32
ఉపాధ్యాయుల ఓట్లు	20,515
పోలైన ఓట్లు	18,739
శాతం	93.84

2023 ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్	
పట్టభద్రుల ఓట్లు	3,30,124
పోలైన ఓట్లు	2,45,576
శాతం	74.39
ఉపాధ్యాయుల ఓట్లు	28,148
పోలైన ఓట్లు	25,887
శాతం	91.97

కట్టుదిట్టమైన బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. జేఎన్‌టీయూ కళాశాల ఆవరణలోని స్ట్రాంగ్ రూంను ఆయన పరిశీలించారు. అనంతరం కౌంటింగు హాలులో ఏర్పాట్లపై ఆరా తీశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారుల వాహనాల ఎంట్రీతో పాటు పార్కింగ్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

హత్య కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నాలుగేళ్ల కిందట నగరంలో జరిగిన ఓ హత్య కేసులో ఇద్దరు దోషులకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి శ్రీనివాసులు తీర్పు వెలువరించారు. కేసు వివరాలను ఎస్పీ ఫక్కీరప్ప మీడియాకు బుధవారం వెల్లడించారు. అనంతపురం మత్స్య శాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న కల్లూరు మహబూబ్‌ఖాన్ 2018 నవంబర్ ఒకటో తేదీన హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నగరానికి చెందిన పటాన్ షేక్షావలి అలియాస్ బ్రూస్లీ, కంబగిరిరెడ్డి నిందితులు. మద్యం తాగేందుకు డబ్బులు అడిగితే ఇవ్వలేదన్న కోపంతో వీరు మహబూబ్‌ఖాన్ తలపై రాళ్లతో కొట్టి హత్య చేశారు. హతుడి కుమారుడు కల్లూరు షహన్వాఖాన్ ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ విజయబాస్కర్‌గౌడ్ క్రైం నంబరు 378/2018 అండర్ సెక్షన్ 302 రెడ్‌విత్ 34 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు. నేరారోపణ రుజువు కావడంతో పటాన్ షేక్షావలి అలియాస్ బ్రూస్లీ, కంబగిరిరెడ్డికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి జి.శ్రీనివాసులు బుధవారం తీర్పు చెప్పారు. బాధితుల తరపున న్యాయవాది రాచమల్లు హరినాథ్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి, సిబ్బందిని ఎస్పీ ఫక్కీరప్ప అభినందించారు.

శిశువును రక్షించిన పోలీసులు



పోలీసులు కాపాడిన చిన్నారి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రోడ్డు పక్కన వదిలేసిన మూడు నెలల పసికందును ఇటుకలపల్లి పోలీసులు కాపాడి, సర్వజనాస్పత్రికి తరలించారు. బుధవారం గుర్తు తెలియని వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి మన్నీల క్రాస్ వద్ద రోడ్డు పక్కన మూడు నెలల మగశిశువును వదిలేసి వెళ్లారని సమాచారం అందించాడు. డయల్ 100 సిబ్బంది నుంచి విషయం తెలుసుకున్న ఇటుకలపల్లి ఎస్ఐ శ్రీకాంత్, బ్లూకోట్స్ సిబ్బంది ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని శిశువును అక్కున చేర్చుకున్నారు. అనంతరం సర్వజనాస్పత్రికి చేర్చి, చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ ఫక్కీరప్ప.. సకాలంలో స్పందించిన ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందిని అభినందించారు. కాగా, శిశువును వదిలేసిన అంశంపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు విద్యార్థుల డీబార్



చున్నీపై రాసుకు వచ్చిన విద్యార్థిని



చేతిపై రాసుకున్న విద్యార్థి

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో బుధవారం నిర్వహించిన డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు డీబార్ అయ్యారు. ఈ మేరకు పరీక్షల విభాగం సంచాలకుడు ఆచార్య జీవీ రమణ తెలిపారు. డీబార్ అయిన వారిలో అనంతపురంలో ఇద్దరు, తాడిపత్రిలో ఒకరు ఉన్నారు. కాగా, ప్రశ్నలను ముందుగానే ఊహించుకుని వాటి జవాబులను ఓ విద్యార్థి చేతిపై, మరో విద్యార్థిని తన చున్నీపై రాసుకుని వచ్చి పట్టుబడడం చర్చనీయాంశమైంది.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ

అనంతపురం: ఎస్కే యూనివర్సిటీ డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం విడుదల చేశారు. మొత్తం 13,750 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 4,945 మంది పాసయ్యారన్నారు. 35.96 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఆయన వెల్లడించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- తొలి రోజు 779 మంది ఫస్టియర్ విద్యార్థుల గైర్హాజరు





అనంతపురంలోని పరీక్ష కేంద్రం వద్ద ఇంటర్ విద్యార్థుల హడావుడి, పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్టియర్ విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు జరిగాయి. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభం కాగా...తొలిరోజు కావడంతో ఉదయం 7.30 గంటల నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులూ కల్పించారు. ఉమ్మడి జిల్లాలో 29,326 మంది విద్యార్థులకు గాను 28,547 మంది పరీక్షలు రాశారు. 779 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 99 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్ విద్యార్థులు 26,777 మందికి గాను 26,127 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 2,549 మంది విద్యార్థులకు గాను 2,420 మంది హాజరయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, బోర్డు పరిశీలకులు రమణగుప్తా, ఆర్‌ఐఓ సురేష్‌బాబు, అనంతపురం , శ్రీసత్యసాయి జిల్లాల డీవీఈఓలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు వివిధ కేంద్రాలను తనిఖీ చేశారు.

నేడు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం
ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలకు 35,184 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అనంతపురం జిల్లాలో 60 కేంద్రాల్లో 22,587 మంది పరీక్షలు రాయనున్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 20,977 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,610 మంది ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 39 కేంద్రాల్లో 12,597 మంది హాజరుకానున్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 11,169 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,428 మంది ఉన్నారు.

ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ హాల్‌టికెట్
హాజరుతో సంబంధం లేకుండా పరీక్షల ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ హాల్‌టికెట్ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పలువురు విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్‌ఐఓ సురేష్‌బాబు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు ఇవ్వాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం

- ధ్వజావరోహణంతో ముగిసిన ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన శ్రీవారి చక్రస్నానం(తీర్థవాది) బుధవారం భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత శ్రీవారి సుదర్శన చక్రానికి భృగుతీర్థంలో చక్రస్నానం చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ దివ్యాయుధం ముంచిన పుష్కరిణి జలంతో స్నానమాచరించారు. పక్షం రోజుల పాటు సాగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతమై లోకం క్షేమంగా ఉండటానికి, భక్తులు సుఖ శాంతులతో ఉండేందుకు చక్రస్నానం నిర్వహిస్తామని అర్చక పండితులు వివరించారు.

చక్రస్నానంతో యజ్ఞఫలం
'బ్రహ్మోత్సవాలు నిర్వహించిన వారికి.. ఇందుకు సహకరించిన వారికి ..ఉత్సవాల్లో శ్రీవారిని దర్శించుకున్న వారికి ఇలా..అందరికీ శ్రీవారి చక్రస్నానంతో ఉత్సవ యజ్ఞఫలం లభిస్తుంది' అని అర్చక పండితులు వివరించారు. చక్రస్నానానికి ముందు స్వామి వారికి విష్వక్సేన ఆరాధన, పుణ్య హవచనం, ముఖ ప్రక్షాళన, ధూప దీప నివేద్యం, ఛత్ర, ఛామర, వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు.

ధ్వజావరోహణం
ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతా మూర్తులను ఆహ్వానించేందుకు ఉత్సవాల ప్రారంభం నాడు అర్చకులు ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం చేసి గరుడ పతాకం ఎగురవేశారు. శ్రీవారి చక్రస్నానం అనంతరం ఆ ధ్వజపటాన్ని అవరోహనం చేశారు. దీన్నే కదిరి ప్రాంతంలో కంకణాలు విప్పడం అంటారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన ముక్కోటి దేవతలకు ధ్వజావరోహణంతో వీడ్కోలు పలికినట్లయ్యిందని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలియజేశారు.

4 గంటల నుంచి ఆలయం మూత
బ్రహ్మోత్సవాల అంకురార్పణ నాటి నుంచి తీర్థవాది వరకూ స్వామి వారు యాగశాలలోనే గడిపారు. తీర్థవాది ముగించుకొని బుధవారం స్వామివారు తిరిగి ఆలయంలోకి ప్రవేశించారు. దీంతో సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం తలుపులు మూసివేశారు. తిరిగి గురువారం(నేటి) ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పుతారు. ఎప్పటిలాగానే శ్రీవారు ఆలయంలో యథాప్రకారం పూజలు అందుకొని భక్తులకు దర్శనమిస్తారు. తీర్థవాది ఉత్సవంలో ఈఓ పట్టెం గురుప్రసాద్, పాలక మండలి చైర్మన్ జెరిపిటి గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, పోలీసులుతో పాటు పాల్గొన్న భక్తులందరూ రంగులు చల్లుకొని ఆనందోత్సాహాలతో గడిపారు.



భృగుతీర్థంలో శ్రీవారికి చక్రస్నానం

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

- చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు అవగాహన
- పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు సమకూర్చాలని డీఈఓ ఆదేశం
- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



మాట్లాడుతున్న డీఈఓ సాయిరాం

అనంతపురం సిటీ: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) సాయిరాం ఆదేశించారు. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. పరీక్షల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అంకితభావం, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కోరారు. పరీక్షల్లో ఎవరైనా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల వారితో కుమ్మక్కైనా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాలకు ఇన్విజిలేటర్లు గానీ, సిబ్బంది గానీ సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏ చిన్న సమస్య కూడా తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ తాగునీరు, ఇతర సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కడే గానీ పిల్లలు నేలపై కూర్చొని పరీక్షలు రాయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల సందేహాలను డీఈఓ నివృత్తి చేశారు. పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందు, డిప్యూటీ డీఈఓలు పద్మప్రియ, శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు శుభవార్త!

- 27 జీఓ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థులు

రాప్తాడురూరల్: డీఎస్సీ– 98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వీరి కోసం బుధవారం 27 జీఓను విడుదల చేసింది. వాస్తవానికి ఈ అభ్యర్థులు న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు. ఐదుగురు ముఖ్యమంత్రులు మారారు కానీ వీరి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చేపట్టిన పాదయాత్ర సమయంలో డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు టైం స్కేల్ ప్రకారం సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల్లో నియమించేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్‌హాక్ ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థులను నియమించేందుకు గతేడాది జూన్‌లోనే ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. డీఎస్సీ–2008 క్వాలిఫైడ్ టీచర్లతో సమానంగా మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఆధారంగా అభ్యర్థులను సెకండరీ గ్రేడ్ టీచర్లుగా (ఎస్జీటీలుగా) నియమించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన జీఓ తాజాగా విడుదల చేసింది. వీరికి వేతనం రూ.32,670గా నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,534 మందికి లబ్ధి చేకూరనుంది. అర్హత గల అభ్యర్థులు ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు ఆసక్తి, ఇష్టతను తెలియజేసేందుకు ఆప్షన్ తీసుకున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 576 మంది అభ్యర్థులకు గాను 540 మంది తమ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ వివరాలన్నీ జిల్లా విద్యాశాఖ ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం తదుపరి ఆదేశాలను బట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.



సీఎం జగన్ న్యాయం చేశారు

25 ఏళ్లుగా మేం పోరాటాలు చేస్తున్నా మా సమస్య పరిష్కారం కాలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మాకు న్యాయం చేశారు. ఆ మహానుభావుడు చేసిన సాయానికి మా కుటుంబాలు జీవితాంతం రుణపడి ఉంటాయి.

– చల్లా రామాంజనేయులు, డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

కమిటీల ఏర్పాటు పూర్తి చేయండి

- అనుబంధ సంఘాల అధ్యక్షులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు క్షేత్రస్థాయిలో మరింత కృషి చేయాలని, ఈ అంశంలో పార్టీ అనుబంధ సంఘాల కమిటీలు క్రియాశీలకమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశమై మాట్లాడారు. రానున్నది ఎన్నికల కాలమని, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు అవిశ్రాంతంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఇందులో భాగంగా మండల, పట్టణ స్థాయి కమిటీలను ఏప్రిల్‌లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ అంశంలో క్షేత్రస్థాయిలో నాయకులందరినీ కలుపుకుని ముందుకెళ్లాలన్నారు. అనంతరం అనుబంధ సంఘాల రీజనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ (బీసీ సెల్), రిలాక్స్ నాగరాజు (సాంస్కృతిక)ను ఆయన ఘనంగా సన్మానించారు. సమావేశంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు సీపీ వీరన్న, మండ్ల సుధాకర్, సైఫుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, ఎగ్గుల శ్రీనివాసులు, చిన్నంపల్లి సోమశేఖర్, డాక్టర్ జోగి హరీష్‌కుమార్‌రెడ్డి, గౌని లక్ష్మీకాంతరెడ్డి, సందీప్‌రెడ్డి, బిందెల శ్రీదేవి, ఎస్వీ నారాయణ, తిప్పలూరు సుధీర్‌రెడ్డి, జి.పాలాక్షిరెడ్డి, మారపురెడ్డి రంగనాథరెడ్డి, చుంచుల నాగప్ప, పెరుగు తిమ్మరాజు, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అధికార దాహం కోసమే లోకేష్ పాదయాత్ర

టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్ పాదయాత్రకు ఎలాంటి అజెండా లేదని, కేవలం అధికారం కోసమే ప్రజలను మభ్యపెట్టేందుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని పైలా నరసింహయ్య విమర్శించారు. బుధవారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. అర్హతే ప్రామాణికంగా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందజేశారన్నారు. మహిళల ఆర్థిక స్వావలంభనకు సీఎం చేపట్టిన చర్యలు యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. చంద్రబాబు పాలనలో వర్షం జాడ లేకుండా పోయిందని, రాష్ట్రం మొత్తం కరువు కోరల్లో చిక్కుకుని ప్రజలు నరకయాతన అనుభవించారని గుర్తు చేశారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత వర్షాలు సమృద్ధిగా కురిసి, జలాశయాలు, చెరువులు, కుంటలు నిండు కుండను తలపిస్తున్నాయన్నారు. భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి వ్యవసాయం పండుగలా సాగుతోందన్నారు.

బెంగళూరులో జిల్లా వాసి మృతి



మృతిచెందిన కార్తీక్(ఫైల్)

బనశంకరి: బెంగళూరులో చోటు చేసుకున్న కారు ప్రమాదంలో అనంతపురం జిల్లాకు చెందిన ఓ విద్యార్థి మృతి చెందారు. ఈ ఘటన బెంగళూరు మడివాళ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్‌కు చెందిన కార్తీక్ (23) బీటెక్ పూర్తి చేసి బెంగళూరులోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ కోరమంగలలో సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో అదే హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ కళాశాలలో పీయూసీ చదువుతున్న ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన భగీరథరెడ్డి (17)తో స్నేహం ఏర్పడింది. మంగళవారం రాత్రి 10 గంటలకు కారులో కార్తీక్, భగీరథరెడ్డి కలిసి బయలుదేరారు. కారును కార్తీక్ వేగంగా నడుపుతూ సిల్క్‌బోర్డు సమీపంలోని నియంత్రణ కోల్పోయి డివైడరును జంప్ చేసి అటు వైపు లైన్‌లోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సును ఢీకొన్నాడు. ఘటనలో కారు నుజ్జునుజ్జైంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించేలోపు ఇద్దరూ మృతిచెందారు. బస్సులోని కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

వృద్ధురాలి మృతి

గుత్తి రూరల్: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రంగాపురానికి చెందిన మద్దక్క (60) కొన్నేళ్లుగా గుత్తి మండలం కరిడికొండలో తన కుమార్తె లలిత వద్ద ఉంటోంది. మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఆమె ప్యాపిలి వైపుగా నడుచుకుంటూ వెళుతుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో నడిరోడ్డుపై పడి మృతిచెందిన మద్దక్క మీదుగా పలు వాహనాలు వెళ్లడంతో ఆనవాలు చిక్కనంతగా ఛిద్రమైంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లాడు. బుధవారం ఉదయం స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న లలిత.. మృతురాలు ధరించిన చీర, ఇతర ఆనవాళ్లను బట్టి తన తల్లి మద్దక్కగా గుర్తించింది. ఘటనపై ఎస్‌ఐ శ్రీనివాసులు దర్యాప్తు చేపట్టారు.

ఎస్కేయూ హెల్త్‌కేర్ సెంటర్‌లో ఈసీజీ పరికరం ఏర్పాటు

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లోని హెల్త్‌కేర్ సెంటర్‌లో ఈసీజీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. బుధవారం హెల్త్ సెంటర్‌లో ఈసీజీ సేవలను వర్సిటీ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులకు ఉపయోగపడేలా ఈ పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య జీవన్‌కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

18న ఉగాది పురస్కారాల ప్రదానం

అనంతపురం కల్చరల్: ప్రకృతి ధర్మపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంపిక చేసిన 45 మంది ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు ధర్మపీఠం మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం వరకూ అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగే పురస్కారాల ప్రదానోత్సవానికి విశిష్ట అతిథులుగా ప్రముఖ కన్నడ నటుడు రాఘవేంద్ర రాజ్‌కుమార్, ప్రముఖ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

జీడీఎస్ ఉద్యోగుల సమ్మె వాయిదా

అనంతపురం సిటీ: తపాలా శాఖకు చెందిన జీడీఎస్ ఉద్యోగులు గురు, శుక్రవారాల్లో తలపెట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను వాయిదా వేసినట్లు ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అనంతపురం డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధానమైన నాలుగు డిమాండ్ల సాధనకు అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో రెండ్రోజుల పాటు దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో దిగొచ్చిన తపాలా శాఖ డైరెక్టర్ జనరల్ నుంచి చర్చలకు పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో సమ్మె నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

క్లినిక్‌ల వివరాలు నమోదు చేయించుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని ప్రైవేట్ వైద్యశాలలు, నర్సింగ్ హోంలు, పాలీక్లినిక్‌లు, డెంటల్ క్లినిక్‌లు, లాబొరేటరీలు, ఫిజియోథెరపి క్లినిక్‌ల నిర్వహణకు సంబంధించి తప్పనిసరిగా ఏపీ వైద్య, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం పరిధిలో నమోదు చేయాలని నిర్వాహకులకు డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి సూచించారు. ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తి కావాలని, గడువు ముగిసిన తర్వాత పోర్టల్‌ను పూర్తిగా ఫ్రీజ్ చేస్తారన్నారు. అనంతరం రెన్యువల్‌కు అవకాశముండదన్నారు. తదుపరి నమోదు కాని సంస్థలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేసవిలో పశుసంపద సంరక్షణకు చర్యలు తీసుకోండి

అనంతపురం అగ్రికల్చర్: వేసవి ఎండల ప్రభావం తీవ్రంగా ఉంటున్న నేపథ్యంలో జిల్లాలోని పశు, జీవసంపద సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం ఆదేశించారు. జిల్లా కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీడీలు, ఏడీలు, డాక్టర్లతో ఆయన మాట్లాడారు. పశుగ్రాసం, నీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అంటు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నారని, ఈ ప్రక్రియ వంద శాతం పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పాడి సంపద ఏమాత్రం తగ్గకుండా పశువైద్య సేవలు మెరుగుపరచాలన్నారు. పశు విజ్ఞానబడి, చేయూత పథకాలపై అవగాహన కల్పించారు.

నీటి గుంతలో పడి చిన్నారి మృతి



మృతిచెందిన చందన్‌కుమార్

రాయదుర్గం టౌన్: ఆడుకుంటూ వెళ్లి నీటి గుంతలో పడి ఓ బాలుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీనివాసులు, శ్రీలక్ష్మి దంపతులకు చందన్‌కుమార్ (3)తో పాటు ఏడాది వయసున్న రోహిత్ ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని శ్రీనివాసులు పోషించుకుంటున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లో తల్లి పనిచేసుకుంటుండగా చందన్‌కుమార్ ఆరుబయట ఆడుకుంటూ తాగునీటి కొళాయి గుంతలో పడ్డాడు. గుంతలో నీరు నిండుగా ఉండడంతో నీట మునిగి ఊపిరి అందక మృతి చెందాడు. కాసేపటి తర్వాత తల్లి బయటకు వచ్చి చూడగా నీటి గుంతలో తేలియాడుతున్న కుమారుడి మృతదేహం కనిపించింది. బిడ్డను వెంటనే వెలికితీసి కుటుంబసభ్యులతో కలసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రబీ ‘ఈ- క్రాప్’లో అభ్యంతరాల స్వీకరణ

ఆత్మకూరు: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ వివరాలు ఈ–క్రాప్‌లో నమోదు చేశామని, ఇందులో అభ్యంతరాలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నదాతలకు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలం తలుపూరులోని రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి, రైతులతో సమావేశమై మాట్లాడారు. మండలంలోని రబీ కింద సాగు చేసిన రైతులు దాదాపు 6102 మంది ఉన్నారు. మండల వ్యాప్తంగా 96 శాతం మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకున్నారన్నారు. రబీలో పంటలు సాగు చేసిన రైతులకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు చేసుకున్న వారి జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు వివరించారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 17వ తేదీ లోపు రాతపూర్వకంగా అందజేయాలని కోరారు. ఇందుకు సంబంధించి సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రబీ సీజన్ ఈ–క్రాప్‌కు సంబంధించి ఇదే చివరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎలాంటి మార్పులు ఉండబోవన్నారు. సమావేశంలో ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ వెంకటేశ్వరప్రసాద్, ఏఈఓ సుజిత, ఎంపీఈఓ భారతి, సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ రెడ్డి, ఓబులేసు, ఎంపీటీసీ సభ్యుడు ఓబులేసు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సేవలు సద్వినియోగం చేసుకోండి

రాప్తాడు/అనంతపురం రూరల్: రాష్ట్రంలో అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటోందని, ఈ క్రమంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన రాప్తాడు మండలం హంపాపురం, రాప్తాడు, మరూరు, ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలోని ఆర్‌బీకేలను సందర్శించి రబీ ఈ క్రాప్ నమోదు అంశానికి సంబంధించి చేపట్టనున్న సామాజిక తనిఖీలపై రైతులను చైతన్య పరిచారు. ఇప్పటి వరకూ ఈ–కేవైసీ చేసుకోని రైతులు వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రాప్తాడు మండలంలో జరిగిన కార్యక్రమంలో ఏఓ శుభకర్, ఆర్‌బీకే అధికారులు అంజన్ రెడ్డి, హర్షవర్ధన్, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి చరణ్‌కుమార్, నాగిరెడ్డిపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, అనంతపురం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, గ్రామ స్థాయి మండలి చైర్మన్ రామసుబ్బారెడ్డి, ఏఓ వెంకటేశ్వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో ఎమ్మెల్యే దంపతుల భేటీ



సీఎంను కలిసిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సాంబశివారెడ్డి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కలిశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వచ్చిన సీఎంను వారు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

షీప్ యూనియన్‌కు త్రీమెన్ కమిటీ

అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల సమాఖ్య జిల్లా యూనియన్‌కు ముగ్గురు సభ్యుల (త్రీమెన్ కమిటీ)తో పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి గోపాలక్రిష్ణ ద్వివేది బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా పసుపుల నరసింహగౌడ్, సభ్యులుగా పి.ఈశ్వరయ్య, బి.కృష్ణప్పలను నియమించారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. రెండేళ్లు లేదా యూనియన్ ఎన్నికలు జరిగే వరకు త్రీమెన్ కమిటీకి అధికారాలిచ్చారు.

క్లుప్తంగా

నగరపాలక సంస్థ ఎస్ఈగా సతీష్‌చంద్ర


సతీష్ చంద్ర

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎఫ్ఏసీ)గా ఎస్ సతీష్ చంద్ర, ఈఈ(ఎఫ్ఏసీ)గా జీ చంద్రశేఖర్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరపాలక సంస్థ ఎస్ఈ నాగమోహన్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో ఆ పోస్టులో సతీష్ చంద్రను, ఖాళీగా ఉన్న ఈఈ పోస్టులో చంద్రశేఖర్‌ను నియమించారు.

సిండికేట్‌నగర్‌లో చోరీ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ సిండికేట్ నగర్‌లో బుధవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే శ్రీనివాస్, సుష్మా దంపతులు సిండికేట్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి రమ్య కూతురు. పరీక్షల కోసమని సుష్మా ఊరికి వెళ్లింది. సాయంత్రం 6:30 గంటల సమయంలో కూతురు స్కూల్ నుంచి బస్సులో వస్తోందని తెలిసి శ్రీనివాసులు ఇంటి సమీపంలోని కూడలికి వెళ్లాడు. కుమార్తె రాగానే తీసుకుని ఇంటికి వెళ్లి చూడగా కాంపౌండ్ గేటు తాళాలు వేసినవి వేసినట్లే ఉన్నాయి. ఇంటి తలుపులు మాత్రం తెరుచుకొని ఉండటంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లి పరిశీలించారు. బీరువా తలుపులు తెరిచి ఉండగా, అందులోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని భావించిన శ్రీనివాసులు డయల్ 100కు ఫోన్ చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. నగదుతో పాటు బంగారం చోరీ అయినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి బుధవారం తెలుగు పరీక్ష నిర్వహించగా మొత్తం 130 మందికిగాను 126 మంది పరీక్షలకు హాజరైనట్లు సూపరింటెండెంట్ సుధాకర్ బాబు తెలిపారు.

18న వేలం పాట

కనగానపల్లి(రామగిరి): రామగిరి మండలంలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న అద్దె గదులు, వ్యాపార సముదాయాల నిర్వహణకు ఈనెల 18, 20 తేదీల్లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ బీఆర్ వెంకటేసులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రకాల అద్దె గదులు, ఐస్‌క్రీం విక్రయాల కోసం వేలం పాటలో పాల్గొనాలనుకునే వారు రూ.20 వేల డిపాజిట్ చెల్లించాలన్నారు. అలాగే టెంకాయలు, పూజా సామగ్రి, హోటళ్లు, కిరణా కొట్లు, ఫొటో విక్రయాలు, సప్లయర్స్ సామాన్లు బాడుగ నిర్వహణ కోసం రూ.1000 చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని చెప్పారు.


వ్యాయామం తప్పనిసరి

ఆత్మకూరు: దివ్యాంగులైన పిల్లలకు రోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం తప్పనిసరిగా చేయిస్తే నరాల్లో కదలికలు వస్తాయని ఫిజియోథెరపిస్ట్ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో పిల్లలతో ఆయన ఫిజియోథెరపీ చేయించారు. అలాగే బొమ్మల ద్వారా పిల్లలకు చదువు ఎలా నేర్పిస్తే అర్థం అవుతుందన్న విషయాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది అరుణ కుమారి, షరీఫా పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు చేస్తే చర్యలు

రాప్తాడు: సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత విమర్శలకు దిగితే చర్యలు తప్పవని ఎస్ఐ పీ.వై.ఆంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంటకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజారామ్ ప్రజా ప్రతినిధులపై సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులో అసత్య కథనాలు పోస్టు చేయడంపై మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన గోర్ల సుదర్శన్ రెడ్డి ... రాజారామ్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ ఆంజనేయులు రాజారామ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఎస్ఐ మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే మేసేజులు, పోస్టింగులకు గ్రూపు అడ్మిన్లదే బాధ్యత అని అన్నారు.

కన్నప్పస్వామి శివైక్యం


కన్నప్పస్వామి

బుక్కరాయసముద్రం: ముసలమ్మ కట్ట సమీపంలోని రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణకర్త కన్నప్పస్వామి(94) బుధవారం శివైక్యమయ్యారు. కన్నప్పస్వామి సొంతూరు తమిళనాడులోని రాజేపాలెం. ఈయన 18వ ఏట తన కుటుంబీకులను వదిలేసి సన్యాసం స్వీకరించారు. 20 ఏళ్ల పాటు శ్రీకాళహస్తి, 10 ఏళ్ల పాటు కర్ణాటకలో ఉన్నారు. తన 50వ ఏట నగరానికి వచ్చిన ఈయన ఓం స్వామి బృందంలో సభ్యుడిగా ఉన్నారు. 1993లో ముసలమ్మ కట్ట వద్ద సిద్ధి వినాయక స్వామి, రాజరాజేశ్వరి ఆలయాన్ని నిర్మించి, తనతో పాటు 20 మంది సాధువులకు నిత్యాన్నదానం చేసేవారు. బుధవారం మధ్యాహ్నం శివైక్యమైనట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, సభ్యులు సతీష్‌కుమార్, చంద్రశేఖర్, నిర్మలమ్మ తెలిపారు. సాయంత్రం ఆలయ సమీపంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశామన్నారు.

వైభవం.. వేంకటేశ్వరుడి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యల్లనూరు: మండల కేంద్రంలో లక్ష్మీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం నుంచి ఆలయంలో అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై అధిష్ఠింపజేశారు. ప్రత్యేక పూజల అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం రథోత్సవం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మైన్ బజార్ మీదుగా పాతపేటకు చేరుకొని అక్కడ నుంచి వెనుతిరిగి రథం దేవాలయానికి చేరుకుంది. ఈసందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా యల్లనూరు, పుట్లూరు ఎస్ఐలు రామకృష్ణ, వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పనులు సద్వినియోగం చేసుకోండి


పి.యాలేరు వద్ద కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అనురాధ

ఆత్మకూరు: మండలంలోని జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ అనురాధ తెలిపారు. బుధవారం మండలంలోని పి.యాలేరు, ముట్టాల గ్రామాల వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం అయినందున పనులు చేసే వారు జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు సుజాత, పుష్ప, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు: ఉపాధి కూలీల హాజరు శాతాన్ని పెంచాలని ఏపీఓ రామకృష్ణారెడ్డి, సావిత్రి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో వారు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కూలీలకు విరివిరిగా పనులు కల్పించాలన్నారు. పనులు జరిగే చోట కూలీలకు వసతులు కల్పించాలన్నారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి


ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ మాడ్యూల్స్ అందిస్తున్న డీఎంహెచ్ఓ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆన్‌లైన్‌లో వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల (ఎంఎల్‌హెచ్‌పీ)కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలబాలికల నిష్పత్తిలో ఉన్న వ్యత్యాసాలను తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హర్ష, రాజేంద్ర, అమర్‌నాథ్, భారతి, త్యాగరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


సంజయ్‌రెడ్డి


మైనుల్ నవాజ్


బాబు

అనంతపురం సప్తగిరి సర్కిల్: మహారాష్ట్రలోని పూణే వేదికగా ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకూ జరిగే జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఎఫ్ 11 కేటగిరిలో సంజయ్‌రెడ్డి, 56 కేటగిరిలో సాకేబాబు, టీ 13 కేటగిరిలో షేక్ మైనుల్ నవాజ్ ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో విశాఖపట్నం వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటుకున్న వీరు జాతీయ స్థాయి పోటీలకు అప్పట్లోనే అర్హత సాధించిన విషయం తెలిసిందే.

వృద్ధురాలిపై కుక్క దాడి

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీలో బుధవారం గౌరమ్మ అనే వృద్ధురాలిపై కుక్క దాడి చేసింది. గమనించిన స్థానికులు ఆమెను స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల పట్టణంలో కుక్కల బెడద అధికమైంది. దీంతో వృద్ధులు, పిల్లలు బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాలుడిపై..

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో బుధవారం కుక్క కాటేయడంతో సాయిచరణ్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయి చరణ్ ట్యూషన్‌కి వెళ్లి ఇంటికి వెళ్తుండగా ఇంటి సమీపంలో కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. బాలుడిని గమనించిన స్థానికులు బిగ్గరగా కేకలు వేయడంతో కుక్క అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాలుడిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో పెద్దపప్పూరుకు చెందిన నాగరాజు అనే కానిస్టేబుల్ మృతి చెందాడు. 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ మిత్రులు బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య లలితకు రూ.80 వేలు, తల్లి లక్ష్మీనారాయణమ్మకు రూ.81 వేల ఆర్థికసాయం చేశారు.ఆర్థిక సాయం అందించిన వారిలో సూర్యనారాయణ, పెద్దన్న, రవి, వెంకటేష్ నాయక్, మురళి, జగన్, ప్రేమనాథ్ రెడ్డి ఉన్నారు. ఈసందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు.

'మార్కెట్' ఆదాయ వ్యయాలపై ఆర్జేడీ సమీక్ష

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ఆదాయ, వ్యయాలపై ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రామాంజినేయులు బుధవారం సమీక్షించారు. అనంతపురంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీడీఎం లావణ్య, ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎస్ మూర్తి, మార్కెట్ యార్డు సెక్రటరీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. రెండు జిల్లాల పరిధిలో ఉన్న 17 మార్కెట్‌యార్డులకు గాను ఈ ఏడాది నిర్దేశించిన ఫీజు వసూళ్లు, సాధించిన ప్రగతిపై తొలుత ఆర్జేడీ ఆరా తీశారు. గత రెండు, మూడేళ్లతో పోల్చుకుంటే ఈ సారి పరిస్థితి ఆశాజనకంగా ఉండడంతో సిబ్బందిని అభినందించారు. అనంతపురం జిల్లాలో నాలుగు కమిటీలు, శ్రీసత్యసాయి జిల్లాలో మూడు కమిటీలు మాత్రమే ఫీజు వసూళ్లలో వెనుకబడి ఉన్నాయని, ఓవరాల్‌గా 95 శాతానికి పైగా లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. అనంతరం ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వాటికి అయ్యే ఖర్చులు, రాబడి, వివిధ రూపాల్లో పన్నుల వసూళ్లకు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. యార్డులు, చెక్‌పోస్టులను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను ఆర్జేడీ వివరించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.10.81 కోట్ల వసూలు లక్ష్యంగా పనిచేయాలని అనంతపురం జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో ప్రస్తుత వసూళ్ల లక్ష్యం రూ.5.24 కోట్లు కాగా, దానిని రూ.4.91 కోట్లకు తగ్గించినట్లు తెలిపారు. మొత్తమ్మీద వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.15.72 కోట్ల వసూళ్ల లక్ష్యంగా పని చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

వలంటీర్‌పై టీడీపీ నాయకుల దాడి

బుక్కరాయసముద్రం: నార్పల మండలం దుగుమర్రి గ్రామంలో ఓ వలంటీర్‌పై టీడీపీ నాయకులు దాడి చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. దుగుమర్రి గ్రామానికి చెందిన వలంటీర్ శివారెడ్డి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ కుర్చీ వద్ద కూర్చుని విధులు నిర్వహిస్తుండగా అదే సమయంలో టీడీపీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి, జయసింహారెడ్డి వన్‌బీ కావాలని అడిగారు. దీంతో డిజిటల్ అసిస్టెంట్ ఆడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారని వలంటీర్ శివారెడ్డి సమాధానం ఇచ్చాడు. దీంతో అసభ్య పదజాలంతో నీవు ఇక్కడ ఎందుకు ఉన్నావని హేళన చేశారు. ఈక్రమంలో మాటామాటా పెరిగి టీడీపీ నాయకులు వలంటీర్‌పై దాడి చేశారు. వలంటీర్‌తోపాటు సచివాలయ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజశేఖర్‌రెడ్డి, జయసింహారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు నార్పల ఎస్ఐ రాఘవరెడ్డి తెలిపారు.

కుష్టు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని డాక్టర్ రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో శాంపిల్స్ సర్వే కమ్ అసెస్మెంట్ టీం (గుంటూరు) ఆధ్వర్యంలో కుష్టు నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ కుష్టుపై గ్రామాల్లో ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. అనుమానిత కేసులు ఉన్నట్లు తెలిస్తే పీహెచ్‌సీకు శాంపిల్స్ పంపించాలన్నారు. వైద్య సిబ్బంది ఈ సర్వేను ఈ నెల 18 నుంచి చేపట్టాలన్నారు. ప్రారంభ దశలో ఉన్న కేసులు గుర్తించి చికిత్స అందించి అంగవైకల్యం రాకుండా కాపాడాలన్నారు. చర్మంపై రాగి రంగు మచ్చలు ఉన్నవారిని గుర్తించి పీహెచ్‌సీకి పంపాలన్నారు. కార్యక్రమంలో మండల డాక్టర్ స్వాతి లక్ష్మి, డీపీఎంఓ బాల ఓబులు, సీహెచ్ఓ మోహన్‌రావు, నోడల్ ఆఫీసర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

'దేశానికి మోదానీ ముప్పు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నాయకులు

అనంతపురం అర్బన్: దేశంలోని ప్రకృతి సంపదను అదానీ కంపెనీ తన వశం చేసుకుంటోందని సీపీఎం జిల్లా కమిటీ విమర్శించింది. ఆ పార్టీ ప్రచురించిన "దేశానికి మోదానీ ముప్పు" పుస్తకాన్ని బుధవారం స్థానిక గణేనాయక్‌భవన్‌లో జిల్లా కార్యదర్శి రాంభూపాల్, ఇతర నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన 2014 నాటికి అదానీ గ్రూపు సంస్థల మార్కెట్ విలువ రూ.56,100 కోట్లు కాగా, 2022 నాటికి రూ.16 లక్షల కోట్లకు చేరిందన్నారు. దేశంలోని ఎనిమిది విమానాశ్రయాలు, 13 ఓడరేవులు, బొగ్గు గనులు, చమురు, సహజవాయువు నిక్షేపాలు, గ్యాస్ పంపిణీ, విద్యుత్, విద్య, రియల్ ఎస్టేట్, వంట నూనెలు, అంతర్జాతీయ వ్యాపారం మొదలు అన్ని రంగాల్లోనూ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించిందన్నారు. స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు ఏడు కంపెనీలు నమోదు కాగా, వాటి అనుబంధంగా 578 సంస్థలు సృష్టించారన్నారు. వీటి విలువ ఎక్కువ ఉన్నట్లుగా కృత్రిమ విలువ పెంచి భాగస్వాములను మోసం చేశారన్నారు. అదానీ సోదరుడు వినోద్ అదానీ మారిషస్‌లో 38 డొల్ల కంపెనీలను అక్రమంగా నిర్వహించారని ఆరోపించారు. దేశ సంపదను దోచుకుంటుంటే ఆదాయ పన్ను శాఖ, ఈడీ స్పందించకపోవడం వెనుక బీజేపీ నేతల అభయం పుష్కలంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లప్ప, బాలరంగయ్య, జగన్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


నల్లబ్యాడ్జీ ధరించి నిరసన తెలుపుతున్న కలెక్టరేట్ ఉద్యోగులు

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలంటూ జేఏసీ అమరావతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీ ధరించి కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు మాట్లాడారు. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులుగా తామెప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదన్నారు. ఉద్యోగుల శ్రేయస్సు, వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నామన్నారు. జేఏసీ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు దశలవారీగా ఆందోళన కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయలక్ష్మి, సెక్షన్ సూపరింటెండెంట్లు తహసీల్దార్లు హరికుమార్, తిరుమలరెడ్డి, పుణ్యవతి, శ్రీధర్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం కోశాధికారి మారుతీప్రసాద్‌రెడ్డి, నాయకులు సోమశేఖర్, అక్రమ్, తదితరులున్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

- డీసీసీ అధ్యక్షురాలు శ్రీలత


మాట్లాడుతున్న జిల్లా వినియోదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత

అనంతపురం అర్బన్: వినియోదారులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వినియోదారుల కమిషన్ (డీసీసీ) అధ్యక్షురాలు శ్రీలత సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగ దారుల దినోత్సవం నిర్వహించారు. జిల్లా సరఫరాల అధికారి శోభరాణి అధ్యక్షతన ''స్వచ్ఛమైన ఇంధన పరివర్తన ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించడం'' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీలత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారుల శ్రేయస్సు కోసం అమలులో ఉన్న చట్టాల గురించి, హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. వస్తువు నాణ్యత, పరిమాణం, కాలవ్యవధి తదితర విషయాల్లో తేడాలు గుర్తిస్తే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదే క్రమంలో న్యాయం కోసం వినియోదారుల ఫోరాన్ని ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ డీఎం నీలమయ్య, తూనికల కొలతల శాఖ అధికారి స్వామి, ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ్ చక్రవర్తి, అదనపు డీఎంహెచ్ఓ చెన్నకేశవ, వినియోగదారుల సంఘం ప్రతినిధి షేక్ నబిరసూల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను జనం విశ్వసించరు

- మేయర్ వసీం


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: పదేళ్లుగా రాజకీయాలు చేస్తున్నా ప్రజలు తనను విశ్వసించడం లేదని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, 30 ఏళ్లయినా ఆయనను రాష్ట్ర ప్రజలు విశ్వసించరని నగర మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ పదేళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర లేదన్నారు. మైనార్టీలు మద్దతివ్వాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి, అందరి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రస్తుతం ఆ మహనీయుని తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. తనకు పిన్న వయసులోనే ఉన్నతమైన మేయర్ పదవి అప్పగించారన్నారు. మైనార్టీలందరూ వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. ఆరునెలలకోసారి వచ్చి నన్ను నమ్మండని అంటే ప్రజలు నమ్మరని, సినిమాలు వేరు, రాజకీయాలు వేరన్నారు. కులమతాల గురించి మాట్లాడే అర్హత పవన్‌కళ్యాణ్‌కు లేదన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికే ముస్లిం సోదరులందరూ కృషి చేస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు అబూసలేహా, సంపంగి రామాంజినేయులు, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు కుళ్లాయస్వామి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ కృషి

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఓ స్వచ్ఛంద సంస్థ వివిధ రంగాలకు చెందిన వంద మంది మహిళలను ఎంపిక చేసి, ఉత్తమ అవార్డులు అందజేయగా, వారిలో అనంతపురానికి చెందిన పద్మలత, సుధామణి, శ్వేత ఉన్నారు. వారితో పాటు వృత్తి శిక్షణలో విశేష ప్రతిభ కనబరచిన అర్చన, జయశ్రీ, హర్షిత జెడ్పీ కార్యాలయ ఆవరణలోని క్యాంప్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని చైర్‌పర్సన్ పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. రాజకీయంగానూ వారికి సముచిత స్థానం కల్పించి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా లోకమంతా వైఎస్ జగన్‌కు రుణపడి ఉండాలని కోరారు.

అండర్–17 టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్ల ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అండర్–17 టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా జట్టు ఎంపికలను బుధవారం స్థానిక నీలం సంజీవరెడ్డి క్రీడా మైదానంలో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఏప్రిల్ 21, 22 తేదీల్లో అనంతపురం వేదికగా జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికై న బాలుర జట్టులో సోరిస్, నితిన్, రాహుల్, నవనీత్, అన్వర్ అలి, ఇర్ఫాన్, ఎస్ ఇర్ఫాన్, సాయి, అజయ్, షారూన్, అభిలాష్, నేహాస్, హంజ, సాయి, సుశాంత్, సుమంత్, హర్షవర్ధన్, మోహన్, క్రిష్, ధీరజ్, గౌతంరెడ్డి, రాకేష్, యశ్వంత్, గగన్‌రెడ్డి, సురేంద్రనాయుడు, ఉదయ్‌శంకర్, షణ్ముఖయోగేష్ చోటు దక్కించుకున్నారు. అలాగే బాలిక జట్టుకు సమత, జెస్సీకా, విజయ, గౌసియా, రజియా, దీపికా, బానుశ్రీ, నవ్య, భువనేశ్వరీ, రాజేశ్వరి, గౌతమి, అలేఖ్యరాణి, ఉషశ్రీ ఎంపికయ్యారు. ఎంపికలను జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ అన్వర్‌బాషా, పీఈటీ రాజేష్, షాహిదా తదితరులు పర్యవేక్షించారు.

బస్ షెల్టర్‌ను ఢీకొన్న వ్యాన్

- ఐదుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన వాహనం

కళ్యాణదుర్గం: ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి పేపర్ వ్యాన్ అదుపు తప్పింది. ఈ సంఘటన బుధవారం ఉదయం కళ్యాణదుర్గం మండలం హులికల్లు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాయదుర్గం వైపు నుంచి ఓ దినపత్రికను రవాణా చేసే వాహనం కళ్యాణదుర్గం వైపు వస్తోంది. ఇదే వాహనంలో కణేకల్లు మండలం ఆదిగానిపల్లి గ్రామానికి చెందిన బంధువులైన నలుగురు సభ్యులు కళ్యాణదుర్గం మండలం బోయలపల్లి గ్రామంలో తమ బంధువైన గౌరమ్మ (92) చనిపోయిందన్న వార్త తెలుసుకుని అంత్యక్రియలకు హాజరయ్యేందుకు గుండ్లపల్లిలో వాహనంలో ఎక్కారు. హులికల్లు గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న బస్ షెల్టర్‌ను పేపర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్ షేక్ నిజాముద్దీన్‌తో పాటు వాహనంలో ప్రయాణిస్తున్న బంధువులైన కురబ రుద్రయ్య, కురబ వన్నమ్మ, మాలమ్మ, వనితమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.